RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్


దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:64 | ఫిబ్రవరి 14, 2026 | వెల: రూ.3-00



- సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీ నుంచి కీలక ట్వీట్

## మున్సిపల్ ఫలితాలు
## ప్రజాపాలనకు ఆమోదం




**116** మొత్తం మున్సిపాలిటీలు

**07** కార్పొరేషన్లు

కాంగ్రెస్ ఖాతాలో..
**64** మున్సిపాలిటీలు
**04** కార్పొరేషన్లు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ఓటర్లు హస్తం వైపు మొగ్గు చూపడంతో మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో 64 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీతో చైర్మన్ పీఠాలను దక్కించుకునే దిశగా సాగుతోంది. కార్పొరేషన్లలోనూ అదే జోరును కొనసాగిస్తూ మహబూబ్ నగర్, నల్లగొండ, రామగుండం, మంచిర్యాల నగరపాలక సంస్థల్లో హస్తం పార్టీ విజయదుందుభి మోగించింది. అయితే, మరోవైపు 38 మున్సిపాలిటీల్లో హంగ్ పరిస్థితి నెలకొనడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను ఉత్కంఠకు దారితీసింది. ఇక్కడ చైర్మన్ పీఠం ఎవరికి దక్కాలన్నది 256 మంది స్వతంత్రులు, ఇతర చిన్న పార్టీల కౌన్సిలర్ల చేతుల్లోనే ఉంది. ముఖ్యంగా నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో అక్కడ ఎంఐఎం, సీపీఐ, బీఆర్ఎస్ పార్టీలు కీలకంగా మారాయి. కరీంనగర్‌లో మాత్రం 30 డివిజన్లను గెలుచుకుని బీజేపీ తన బలాన్ని చాటుకుంది. ఈ నేపథ్యంలో, గెలిచిన అభ్యర్థులను కాపాడుకోవడానికి మరియు హంగ్ మున్సిపాలిటీల్లో మద్దతు కూడగట్టడానికి ప్రధాన పార్టీలు వ్యూహప్రతివ్యూహాలతో క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి.


'పుర' పోరులో

# హస్తం హవా

### ఇండిపెండెంట్ల ఖాతాల్లో 256 వార్డులు

- కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా
- నిజామాబాద్లో ఏ పార్టీకీ దక్కని మెజార్టీ
- కొత్తగూడెంలో హంగ్.. కాంగ్రెస్‌కు చుక్కెదురు
- చైర్మన్ పీఠాల కోసం పార్టీల వ్యూహప్రతివ్యూహాలు
- స్వతంత్ర కౌన్సిలర్లపై ప్రధాన పార్టీల దృష్టి

2లో






### 750 వార్డుల్లో విజయం సాధించాం

- మున్సిపల్ ఫలితాల్లో మెరుగైన ప్రదర్శన
- ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడింది
- సీపీఐతో కలిసి పోటీలోకి దిగాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

### నాది, రేవంత్ రెడ్డిది

# లక్కీ జోడి

- సమన్వయంతో పార్టీ ముందుకు..
- ప్రజల ఆకాంక్షే లక్ష్యం
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ గెలుపు మాదే..
- టీపీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



2లో


# క్యాంప్ పాలిటిక్స్!

### కింగ్ మేకర్లకు భారీగా ఆఫర్లు

### అవసరాన్ని బట్టి కోటి నుంచి కోటిన్నర వరకు డిమాండ్

- 256 వార్డుల్లో ఇండిపెండెంట్ల హవా
- పలు చోట్ల అభ్యర్థుల బలవంతపు తరలింపు
- సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా మోహరించిన పోలీసులు
- 16న చైర్మన్లు, మేయర్ల ఎన్నిక..
- పీఠం కోసం కాంగ్రెస్‌లో అంతర్గత పోటీ షురూ
- రాష్ట్రంలో రసవత్తరంగా రాజకీయం..

2లో



## కరీంనగర్‌లో కమల వికాసం

### బీజేపీ ఖాతాలో మేయర్ పీఠం

- 66 డివిజన్లలో 33 స్థానాలు బీజేపీకి
- ఎక్స్‌ఆఫీషియో ఓటుతో మేజిక్ ఫిగర్ పూర్తి..
- బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం



వేద న్యూస్

శనివారం | ఫిబ్రవరి 14, 2026

### మున్సిపల్ ఫలితాలు

# ప్రజాపాలనకు ఆమోదం

## సీఎం రేవంత్ రెడ్డి.. ఢిల్లీ నుంచి కీలక ట్వీట్

**వేద న్యూస్, డెస్క్**



తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన సంపూర్ణ ఆమోదమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ కాంగ్రెస్ అభ్యర్థుల విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును ప్రజలు ఆదరించారని, అదే ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిఫలించిందని తెలిపారు. పేదలు, మధ్య తరగతి ప్రజల సంక్షేమంతో పాటు ఆధునిక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి లభించిన ఈ విజయం తమపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం కోసం కష్టపడ్డ పార్టీ కార్యకర్తలందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, వారి కృషి, అంకితభావానికి ఈ విజయం నిదర్శనమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# 750 వార్డుల్లో విజయం సాధించాం

- మున్సిపల్ ఫలితాల్లో మెరుగైన ప్రదర్శన
- ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడింది
- సీపీఐతో కలిసి పోటీ చేశాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కల్వకుంట్ల తారక రామారావు స్పందించారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలు వీరోచితంగా పోరాడారని, 750 వార్డుల్లో విజయం సాధించామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని, తమ విజయంతో కాంగ్రెస్ నేతల నోళ్లు మూతపడ్డాయని వ్యాఖ్యానించారు. 117 స్థానాల్లో మంచి ఫలితాలు సాధించామని కేటీఆర్ పేర్కొన్నారు. అనేక చోట్ల అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ, ఇప్పటికే బేరసారాలు ప్రారంభమయ్యాయని అన్నారు. అయినప్పటికీ తమ పార్టీ బలాన్ని ఈ ఫలితాలు స్పష్టంగా చాటుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణి ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీతో కలిసి పోటీ చేశామని, ఆ పార్టీకి మద్దతు ఇస్తామని ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీని అడ్డుకునేందుకు సీపీఐతో కలిసి వ్యూహాత్మకంగా పోటీ చేసినట్లు వెల్లడించారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచారని, భవిష్యత్ ఎన్నికల్లో మరింత బలంగా ముందుకు సాగుతామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# నాది, రేవంత్ రెడ్డిది లక్కీ జోడి

- సమన్వయంతో పార్టీ ముందుకు
- ప్రజల ఆకాంక్షలే లక్ష్యం
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ గెలుపు మాదే
- టీపీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



నాది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది లక్కీ జోడి అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. గతంలో డి. శ్రీనివాస్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి కలిసి పార్టీని ఎలా నడిపారో అదే విధంగా తాము సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం, తాను కలిసి పనిచేస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు ఉపయోగపడేలా అమలు చేస్తున్నామని, అందుకే ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల ఫలితాలు వస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలపడుతోందని, ప్రజలు ప్రభుత్వ పనితీరుకు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమన్వయంతో ముందుకు సాగుతున్న పార్టీకి ప్రజల ఆశీర్వాదం కొనసాగుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# 'పుర' పోరులో హస్తం హవా

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో జరిగిన పురపాలిక, నగరపాలిక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు మెజార్టీ స్థానాల్లో విజయం సాధించడంతో అత్యధిక మున్సిపాలిటీల్లో హస్తం జెండా రెపరెపలాడుతోంది. కార్పొరేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించి తన రాజకీయ బలం చాటుకుంది. మొత్తం 116 పురపాలికలు, 7 నగరపాలికలకు ఈ నెల 11న ఎన్నికలు జరగగా, తాజాగా ఫలితాలు వెల్లడయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీల్లో విజయం సాధించగా, పలు చోట్ల హంగ్ పరిస్థితి ఏర్పడింది. దీంతో ఛైర్మన్ పీఠాలను దక్కించుకునేందుకు ప్రధాన పార్టీలు వ్యూహప్రతివ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. గెలిచిన కౌన్సిలర్లను కాపాడుకోవడంతో పాటు స్వతంత్రులు, ఇతర పార్టీ కౌన్సిలర్ల మద్దతు కోసం ప్రయత్నాలు ప్రారంభించాయి. మొత్తం 116 మున్సిపాలిటీల్లోని 2,582 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 1,347 వార్డుల్లో విజయం సాధించింది. అలాగే 64 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం సాధించి ఛైర్మన్ పీఠాలను దక్కించుకునే స్థితికి చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ 717 వార్డుల్లో గెలుపొందడంతో పాటు 13 మున్సిపాలిటీల్లో గులాబీ జెండాను ఎగురవేసింది. బీజేపీ 261 వార్డుల్లో విజయం సాధించగా, స్వతంత్ర అభ్యర్థులు 256 వార్డుల్లో గెలుపొందారు. ఇక 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీ పూర్తి మెజారిటీ సాధించకపోవడంతో హంగ్ పరిస్థితి ఏర్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కైవసం చేసుకోవడం విశేషం. కాంగ్రెస్ పార్టీ నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, చిట్యాల, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, చెన్నూరు, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, సంగారెడ్డి, ఆందోలు–జోగిపేట, సదాశివపేట, రామాయంపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర, అశ్వారావుపేట, ఇల్లెందు, ములుగు, యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపాలిటీల్లో విజయం సాధించింది.

బీఆర్ఎస్ పార్టీ గడ్డపోతారం, ఇంద్రేశం, అయిజ, తొర్రూర్, ఇబ్రహీంపట్నం, తిరుమలగిరి, ఆమన్‌గల్, సిరిసిల్ల, గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీల్లో గెలుపొందింది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ వడ్డేపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. దేవరకద్ర, అలంపూర్, దేవరకొండ, ఆలియాబాద్, కోహీర్, కేసముద్రం, ఆసిఫాబాద్, అమరచింత, గద్వాల, క్యాతనపల్లి, జనగామ, జిన్నారం, నర్సాపూర్, జమ్మికుంట, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, బెల్లంపల్లి తదితర మున్సిపాలిటీల్లో హంగ్ పరిస్థితి నెలకొంది. మొత్తం మీద మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది.




### హస్తం ఖాతాలో నాలుగు కార్పొరేషన్లు

మహబూబ్ నగర్, నల్లగొండ, రామగుండం, మంచిర్యాల కార్పొరేషన్లలో కాంగ్రెస్ కు స్పష్టమైన మెజార్టీ వచ్చింది. కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం డివిజన్లు 66 కాగా, బీజేపీకి 30, కాంగ్రెస్ 13, స్వతంత్ర అభ్యర్థులు 15, బీఆరెస్ 8 స్థానాలు దక్కించుకుని కమలం పార్టీకి స్పష్టమైన మెజార్టీ వచ్చింది. నిజామాబాద్లో మొత్తం డివిజన్లు 60. కాగా, బీజేపీ 28, కాంగ్రెస్ 18, బీఆర్ఎస్ 1, ఎంఐఎం 13 స్థానాలు గెలుచుకున్నారు. ఇక్కడ ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు..ఇక్కడ ఎంఐఎం చాలా కీలకం కానుంది. కొత్తగూడెం కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడింది. మొత్తం డివిజన్లు 60కాగా, కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, బీజేపీ1, ఇతరులు 7 వచ్చాయి.. కాగా ఇక్కడ బీఆర్ఎస్, ఇండిపెండెంట్లు కీలకం కానున్నారు.

- 64 మున్సిపాలిటీలు.. 4 కార్పొరేషన్లలో కాంగ్రెస్ సత్తా
- 17 పుర పాలికల్లో బీఆర్ఎస్ జోరు
- 34 మున్సిపాలిటీల్లో హంగ్
- వడ్డేపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకున్న ఫార్వర్డ్ బ్లాక్
- ఇండిపెండెంట్ల ఖాతాల్లో 256 వార్డులు
- కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా
- నిజామాబాద్లో ఏ పార్టీకీ దక్కని మెజార్టీ
- కొత్తగూడెంలో హంగ్.. కాంగ్రెస్‌కు చుక్కెదురు
- చైర్మన్ పీఠాల కోసం పార్టీల వ్యూహప్రతివ్యూహాలు
- స్వతంత్ర కౌన్సిలర్లపై ప్రధాన పార్టీల దృష్టి

# క్యాంప్ పాలిటిక్స్!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ పురపాలక ఎన్నికల ఫలితాలు వెలువడటంతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన హవాను చాటుకుంది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో 64 స్థానాలను కైవసం చేసుకోవడమే కాకుండా, 7 కార్పొరేషన్లలో 4 చోట్ల మేయర్ పీఠాలను దక్కించుకుని తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ 13 మున్సిపాలిటీల్లో పట్టు నిలుపుకోగా, కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీ కైవసం చేసుకుంది. ఫలితాల వెల్లడి ముగియకముందే రాష్ట్రంలో 'క్యాంపు రాజకీయాలు' తెరపైకి రావడం గమనార్హం.

### 38 మున్సిపాలిటీల్లో హంగ్.. స్వతంత్రులే కింగ్ మేకర్లు!

ప్రజా తీర్పు స్పష్టంగా ఉన్నప్పటికీ, సుమారు 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి కూడా చైర్మన్ పీఠాన్ని అధిష్ఠించేందుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ లభించలేదు. ఇక్కడ గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు ఇప్పుడు అత్యంత కీలకంగా మారారు. కనీసం 30కి పైగా మున్సిపాలిటీల్లో చైర్మన్ పీఠం ఎవరికి దక్కాలనేది ఈ స్వతంత్రుల చేతుల్లోనే ఉంది. దీంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ స్వతంత్రులను తమ వైపు తిప్పుకునేందుకు వేట మొదలుపెట్టారు.

### ఫామ్ హౌస్ పాలిటిక్స్

16న చైర్మన్లు, మేయర్ల ఎంపిక జరగనుండటంతో అభ్యర్థులు చేజారిపోకుండా పార్టీలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయి. గెలిచిన అభ్యర్థులను, తమకు మద్దతు ఇచ్చే స్వతంత్రులను గురువారం రాత్రే ప్రత్యేక బస్సుల్లో రహస్య ప్రాంతాలకు తరలించారు. ఆదిలాబాద్ జిల్లాలో గెలిచిన కొందరు అభ్యర్థులను ఏకంగా కాశీ యాత్రకు తీసుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది. మరికొన్ని చోట్ల ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయించి, నగర శివార్లలోని ఫామ్ హౌస్‌లు, రిసార్ట్స్‌లో బస ఏర్పాటు చేశారు. ఫలితాల తర్వాత ప్రత్యర్థి పార్టీలు ప్రలోభాలకు గురిచేయకుండా ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.




### కోట్లు పలుకుతున్న స్వతంత్రులు..

చైర్మన్ పీఠంపై కన్నేసిన అభ్యర్థులు స్వతంత్రులకు కళ్లు చెదిరే ఆఫర్లు ప్రకటిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఒక్కో స్వతంత్ర అభ్యర్థికి రూ. 50 లక్షల నుండి రూ. 1 కోటి వరకు ఆఫర్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకా ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మున్సిపాలిటీల్లో ఇంకా ఎక్కువగా డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. నగదుతో పాటు ఖరీదైన ప్లాట్లు, కారు వంటి ఆఫర్లు కూడా ఇస్తున్నట్లు సమాచారం. మద్దతు తెలుపుతామని హామీ ఇచ్చిన వారికి ఇప్పటికే కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా కూడా ముట్టజెప్పినట్లు తెలుస్తోంది.

### పలుచోట్ల ఉద్రిక్తతలు..

ఈ లాబీయింగ్ ప్రయత్నాల నేపథ్యంలో పలు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అభ్యర్థుల తరలింపు సమయంలో పార్టీ కార్యకర్తల మధ్య తోపులాటలు జరిగాయి. పరిస్థితి అదుపు తప్పకుండా రాష్ట్రవ్యాప్తంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద, కీలక నేతల నివాసాల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. హంగ్ ఏర్పడిన ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు భారగా బందోబస్తు నిర్వహించారు.

**అవసరాన్ని బట్టి కోటి నుంచి కోటిన్నర వరకు డిమాండ్**

- పలు చోట్ల అభ్యర్థుల బలవంతపు తరలింపు
- సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా మోహరించిన పోలీసులు
- 16న చైర్మన్లు, మేయర్ల ఎన్నిక..
- పీఠం కోసం కాంగ్రెస్లో ఇప్పటి నుంచే పోటాపోటీ
- రాష్ట్రంలో రసవత్తరంగా రాజకీయం..

### కాంగ్రెస్ క్లీన్ స్వీప్.. నిలదొక్కుకున్న బీఆర్ఎస్

రాష్ట్రంలోని పట్టణ ఓటర్లు ఈసారి కాంగ్రెస్‌కు జై కొట్టారు. ముఖ్యంగా నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రభంజనం సృష్టించారు. నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, సదాశివపేట, మధిర వంటి కీలక మున్సిపాలిటీలను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని భావించినా.. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకుంది. సుమారు 20 మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగిరింది. ఉత్తర తెలంగాణలోని నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో బీజేపీ గతంతో పోలిస్తే మెరుగైన స్థానాలను సాధించి, కింగ్ మేకర్‌గా అవతరించింది.

# కరీంనగర్‌లో కమల వికాసం

**వేద న్యూస్, కరీంనగర్**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగుతున్నప్పటికీ, కరీంనగర్ కార్పొరేషన్‌లో మాత్రం కమలం వికసించింది. మొత్తం 66 డివిజన్లలో జరిగిన పోటీలో భారతీయ జనతా పార్టీ 33 స్థానాలు గెలుచుకుని సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 12, భారత రాష్ట్ర సమితి 9, ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ 7, ఇతరులు 5 స్థానాలకు పరిమితమయ్యారు. మేయర్ పీఠానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 34 కాగా, బీజేపీ 33 స్థానాలతో మెజారిటీకి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్స్‌ఆఫీషియో ఓటు బీజేపీకి కీలకంగా మారింది. ఆ ఓటుతో బీజేపీ బలం 34కు చేరడంతో ఎటువంటి ఇతర పార్టీల మద్దతు అవసరం లేకుండానే మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోవడం గమనార్హం. కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకున్నప్పటికీ బీజేపీ జోరును అడ్డుకోవడంలో విఫలమైంది. ఈ ఫలితాలతో కరీంనగర్ మరోసారి బీజేపీకి బలమైన కంచుకోటగా నిలిచిందని పార్టీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ నిర్వహించిన కార్యక్రమాలు, అభివృద్ధి నినాదాలు ఓటర్లను ఆకట్టుకున్నాయని పార్టీ నాయకులు చెబుతున్నారు. పాత నగర ప్రాంతాల్లోనూ బీజేపీ గట్టి పోటీ ఇచ్చి స్థానాలు గెలుచుకోవడం విశేషంగా మారింది. ఈ విజయంతో ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ బలాన్ని మరోసారి చాటుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**బీజేపీ ఖాతాలో మేయర్ పీఠం**

- 66 డివిజన్లలో 33 స్థానాలు బీజేపీకి
- ఎక్స్‌ఆఫీషియో ఓటుతో మేజిక్ ఫిగర్ పూర్తి
- బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 14, 2026

# ఆధ్యాత్మిక త్రోవలో శ్రీనివాస్

- శివాలయ కమిటీ చైర్మన్‌గా చక్కటి సేవలు
- సామాన్ సారథ్యంలో పదో సారి శివపార్వతుల కల్యాణం



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల పరిధిలోని కనగర్తి గ్రామ శివాలయ కమిటీ చైర్మన్ సామాన్ శ్రీనివాస్ ఆధ్యాత్మిక త్రోవలో భగవత్ సన్నిధిలో చక్కటి సేవలందిస్తున్నారు. గ్రామ శివాలయ కమిటీ చైర్మన్‌గా అందరినీ సమన్వయపరుస్తూ.. ఆలయ కార్యక్రమాలు సఫలీకృతంగా ముందుకు సాగడంలో తన వంతు పాత్రను చక్కగా పోషిస్తున్నారు. ఈ నెల 15న ఆయన సారథ్యంలో శివాలయంలో జరగబోయే కల్యాణం పదోది. కాగా, శివ పార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు సామాన్ శ్రీనివాస్ వెల్లడించారు.

**కల్యాణానికి ప్రజలందరికీ ఆహ్వానం: శ్రీనివాస్**

కనగర్తి గ్రామ శివాలయంలో శివపార్వతుల కల్యాణ మండపంలో నిర్వహించే కల్యాణానికి హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు, ప్రముఖులు, భక్తులు అందరినీ ఆహ్వానిస్తున్నామని శివాలయ కమిటీ చైర్మన్ సామాన్ శ్రీనివాస్ తెలిపారు. కల్యాణానికి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించి.. స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ప్రజలను కోరారు. శివాలయంలో ధ్వజ స్తంభం పున:ప్రతిష్ఠ డిసెంబర్ 2012లో జరిగిందని, 2013 నుంచి శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ వివరించారు. అంగరంగ వైభవంగా కల్యాణం జరిగేలా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. శివాలయ కమిటీ వైస్ చైర్మన్ పుల్ల భరత్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు అందరి సహకారంతో ఏర్పాట్లు చేస్తూ.. చక్కగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు సామాన్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

# పేరుపేరున ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

- 19 వ వార్డు ప్రజలకు..
- బీఆర్ఎస్ కౌన్సిలర్ జావిద్



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ 19వ వార్డు ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరున బీఆర్ఎస్ కౌన్సిలర్ జావిద్ ధన్యవాదాలు తెలిపారు. 19వ వార్డు ప్రజల సంక్షేమం అభివృద్ధి యే ధ్యేయంగా చిత్తశుద్ధితో తాను పనిచేస్తానని ఈ సందర్భంగా జావిద్ వెల్లడించారు. సుమారు 107 ఓట్ల మెజారిటీతో తనను కౌన్సిలర్ గా గెలిపించిన ప్రజల ను మరువబోనని పేర్కొన్నారు. హోరాహోరీగా సాగిన పోరులో గులాబీ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలిచి జావిద్ విజయం సాధించడంతో భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 24/7 తాను ప్రజలకు పిలుపు దూరంలోనే అందుబాటులో ఉంటానని వెల్లడించారు.

# అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదు

- ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉన్నాం
- ఇందూరి చంద్రశేఖర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు



**వేద న్యూస్, రుద్రూర్:**

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్‌పై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని, మరోసారి ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడితే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ షేక్ నిస్సార్, నాయకులు కర్క అశోక్, ఓబీసీ జనరల్ సెక్రెటరీ పట్ల సురేష్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వ్యక్తి ఇందూరి చంద్రశేఖర్ అని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై దుష్ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ నెల 9వ తేదీ రాత్రి ఇందూరి చంద్రశేఖర్ తన మిత్రుడు వెంకట్‌రామ్ రెడ్డి ఇంటికి విందుకు వెళ్లారని తెలిపారు. ఆ విందుకు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారని, బీఆర్ఎస్ నాయకుడు సాయంత్రం 7.25 గంటలకు వచ్చాడని, తాము రాత్రి 10.20 గంటలకు అక్కడికి చేరుకున్నామని వివరించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఉన్నట్లు వీడియో క్లిప్‌లను ఎడిట్ చేసి దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. అలాగే, మీరు బీఆర్ఎస్ నాయకులతో కలిశారంటూ ఆరోజు రాత్రి బాన్సువాడలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ తమ కారును అడ్డుకుని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరి చంద్రశేఖర్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తాము కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ కట్టుబడి ఉన్నామని, కాంగ్రెస్ నాయకులు ఎవరో, బీఆర్ఎస్ నాయకులు ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. ఇకపై ఇందూరి చంద్రశేఖర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్ రావు, షేక్ గౌస్, కాసుల మహేష్, వడ్ల నరేష్, నజీర్, బర్ల చిట్టి, అక్కపల్లి శ్రీను, ప్రవీణ్, చింతల శ్రీనివాస్, గాండ్ల శ్రీను, వార్డు సభ్యులు అమంద్ వెంకటేష్, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా పని చేస్తాం

- 3 వ వార్డు ప్రజలకు ధన్యవాదాలు
- బీజేపీ కౌన్సిలర్ కొలకాని రాజకుమారి రాజు



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ 3వ వార్డు (రామన్న పల్లె) ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరున బీజేపీ కౌన్సిలర్ కొలకాని రాజకుమారి రాజు ధన్యవాదాలు తెలిపారు. 3వ వార్డు ప్రజల సంక్షేమం అభివృద్ధి యే ధ్యేయంగా చిత్తశుద్ధితో తాము పనిచేస్తానని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తమనుగెలిపించిన ప్రజల ను మరువబోనని పేర్కొన్నారు. హోరాహోరీగా సాగిన పోరులో కమలం పువ్వు పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలిచి రాజ కుమారీ విజయం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 24/7 తాను ప్రజలకు పిలుపు దూరంలోనే అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, మూడో వార్డు కౌన్సిలర్ రాజకుమారి వెల్లడించారు.

# సేవింగ్స్, డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన

- సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలి
- ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఫైనాన్షియల్ లిటరసీ వీక్ నిర్వహణ




**వేద న్యూస్, నల్లబెల్లి:**

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం నిర్వహించే ఫైనాన్షియల్ లిటరసీ వీక్ కార్యక్రమం నల్లబెల్లి గ్రామ పంచాయతీలో డీసీసీ బ్యాంక్ మేనేజర్ యాకూబ్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు సేవింగ్స్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ సేవల వినియోగం, డిజిటల్ పేమెంట్స్ (యూపీఐ, ఏటీఎం, నెట్ బ్యాంకింగ్) సురక్షిత వినియోగంపై వివరించారు. సైబర్ మోసాల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా సరైన రుణాల వినియోగం, పెట్టుబడుల అవకాశాలపై కూడా వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత, మహిళలు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆర్థిక అవగాహన పెరిగిందని యాకూబ్ పాషా తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ వీక్ కార్యక్రమాలు ప్రజల ఆర్థిక శిక్షణకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ మేనేజర్ యాకూబ్ పాషా, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎగువ ప్రాంత రైతులకు నీరు అందించాలి

- సర్పంచ్ గన్నేరం వసంత



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామానికి రంగనాయక సాగర్ ఎల్ఎం-6 కాల్వ ద్వారా బతుకమ్మ చెరువు నిండి మత్తడి పారడంతో గ్రామస్తులు మైసమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మత్తడి వద్ద టెంకాయ కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గన్నేరం వసంత మాట్లాడుతూ గ్రామంలోని సుమారు 50 శాతం భూములు ఎలాంటి కరువు లేకుండా సాగవుతున్నాయని తెలిపారు. అయితే మెట్ట ప్రాంతంలో ఉన్న మిగతా 50 శాతం భూములకు ఫిబ్రవరి నెల నుంచే నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రంగనాయక సాగర్ ఎల్ఎం6 ఫీడర్ ఛానల్ నిర్మాణం పూర్తయితే పెద్ద లింగాపూర్, రామోజీపేట, చిక్కుడువానిపల్లి, వెల్జిపూర్ గ్రామాలతో పాటు తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణ మే స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసి కాల్వ నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లవేని రమేష్, వార్డు సభ్యులు లింగంపల్లి అనిల్ కుమార్, మతిరెడ్డి రవీందర్ రెడ్డి, సుద్దాల రామయ్య, ఎద్దు నాగరాజు, మతిరెడ్డి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపాలిటీలో

**28 మంది కౌన్సిలర్ విజేతలు**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి**

వార్డు వారీగా విజేతల జాబితా

1వ వార్డు సంఘు హన్మవ్వ (కాంగ్రెస్)
2వ వార్డు ఏనుగు జ్యోతి రెడ్డి (బీఆర్ఎస్)
3వ వార్డు గుడిసె సంతోష్ (కాంగ్రెస్)
4వ వార్డు తోట రాజు (కాంగ్రెస్)
5వ వార్డు వాసాల లావణ్య (బీఆర్ఎస్)
6వ వార్డు కాశ శ్రీనివాస్ (కాంగ్రెస్)
7వ వార్డు టైలర్ శ్రీనివాస్ (స్వతంత్రుడు)
8వ వార్డు మైలారం శ్రీనివాస్ (బీజేపీ)
9వ వార్డు రామతీర్థపు మాధవి (బీఆర్ఎస్)
10వ వార్డు సిరిగిరి సంగీత (కాంగ్రెస్)
11వ వార్డు వెంగల అనిత (బీఆర్ఎస్)
12వ వార్డు రామతీర్థపు కృష్ణవేణి (కాంగ్రెస్)
13వ వార్డు మూడపల్లి నీలమ్మ (కాంగ్రెస్)
14వ వార్డు తుమ్మ మధు (కాంగ్రెస్)
15వ వార్డు పుల్కం రాజు (కాంగ్రెస్)
16వ వార్డు వంగల శ్రీనివాస్ (బీజేపీ)
17వ వార్డు కొండ్లపు చిన్న ముత్యం (బీజేపీ)
18వ వార్డు కొండా రాజశేఖర్ (కాంగ్రెస్)
19వ వార్డు కుమ్మరి శిరీష (స్వతంత్రురాలు)
20వ వార్డు కుమ్మరి శంకర్ (బీజేపీ)
21వ వార్డు నరాల శేఖర్ (బీఆర్ఎస్)
22వ వార్డు ఇప్పుల మమత (కాంగ్రెస్)
23వ వార్డు బోనాల సాగరిక (బీజేపీ)
24వ వార్డు అన్నారం శ్రీనివాస్ (కాంగ్రెస్)
25వ వార్డు కోక్కల బాలకృష్ణ (కాంగ్రెస్)
26వ వార్డు మామిండ్ల అమర్ (బీజేపీ)
27వ వార్డు రేగుల రేణుక (బీజేపీ)
28వ వార్డు ప్రతాప హిమబిందు (బీజేపీ)

**పార్టీల వారీగా మొత్తం స్థానాలు**

మొత్తం వార్డులు: 28
కాంగ్రెస్ పార్టీ: 13
బీఆర్ఎస్ పార్టీ: 05
బీజేపీ పార్టీ: 08
స్వతంత్రులు: 02

# మిర్యాలగూడ మున్సిపాలిటీ ‘హస్త’గతం

- 31 వార్డుల్లో కాంగ్రెస్ విజయం
- 14 వార్డులకు పరిమితమైన బీఆర్ఎస్
- ఒక్కో స్థానం బీజేపీ, ఇతరులకు

**వేద న్యూస్, దామరచర్ల:**

మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. మిర్యాలగూడ పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 31 వార్డులను గెలుచుకోగా, బీఆర్ఎస్ పార్టీ 14 వార్డులకు పరిమితమైంది. బీజేపీ ఒక వార్డు గెలుచుకోగా, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒక వార్డులో విజయం సాధించారు. మ్యాజిక్ ఫిగర్‌కు మిం చి స్థానాలు సాధించిన కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించు కోనుంది. ఈ విజయం నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

# మెట్టుగుట్టపై మహాశివరాత్రి ప్రత్యేక పూజలు

- ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో, తహసీల్దార్



**వేద న్యూస్, మడికొండ:**

వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్టపై మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం స్వామివారికి మేల్కొలుపు, సుప్రభాతం, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, అఖండ దీపారాధన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, గణపతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఆర్డీవో రమేష్ రాథోడ్, కాజీపేట తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, ఉత్సవాల ప్రత్యేక అధికారి ఎన్. కవిత, అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 14, 2026

# టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడిపై ఇద్దరు ఎస్ఐల లాఠీచార్జ్

- భార్యా పిల్లల ముందే రాజకీయ నాయకుడిపై పోలీసుల దాడి
- నివాసం ముందు నిలబడడమే నేరమా..? బాధితుడి ఆవేదన
- లాఠీచార్జ్ చేసిన ఎస్ఐలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- సిరిసిల్లకు వస్తా.. రోడ్డెక్కుతా
- తీన్మార్ మల్లన్న ఘాటు హెచ్చరిక



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల పట్టణంలో బుధవారం సాయంత్రం జరిగిన ఘటన తీవ్ర ఆందోళనకు దారి తీసింది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) జిల్లా అధ్యక్షుడు బుర్ర మల్లేశం గౌడ్‌పై పోలీసులు లాఠీలతో దాడి చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. బుధవారం సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఉన్న తన నివాసం ఎదుట బుర్ర మల్లేశం గౌడ్ నిలబడి ఉన్నారు. సమీపంలో పోలింగ్ కేంద్రం ఉండటంతో అక్కడికి వచ్చిన టౌన్ ఎస్ఐ శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ ఆయనను అక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. తాను అక్కడే నివాసం ఉంటానని చెప్పినప్పటికీ, పోలీసులు లోపలికి వెళ్లాలని హెచ్చరించినట్లు తెలిసింది. ఇంట్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే ఇద్దరు ఎస్ఐలు శ్రీకాంత్, దిలీప్ లాఠీలతో ఆయనపై దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించారు. ఈ ఘటన సమయంలో ఆయన భార్య, పిల్లలు అక్కడే ఉండగా, వారి ముందే దాడి జరగడం కలచివేసింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వెంటనే బుర్ర మల్లేశం గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ మాదం రజినీకుమార్, రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషాలను పరామర్శించవలసిందిగా ఆదేశించారు. దీంతో అఖిల్ పాషా, జిల్లా పార్టీ నాయకులు బుర్ర మల్లేశం గౌడ్ నివాసానికి చేరుకుని పరామర్శించారు.

అనంతరం తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, టీఆర్‌పీ నాయకులతో కలిసి సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లాఠీచార్జ్ చేసిన టౌన్ ఎస్ఐ శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్‌లపై ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో ఉన్న టౌన్ సీఐ కృష్ణ ఫిర్యాదు స్వీకరించకుండా వెళ్లిపోయినట్లు, అనంతరం అక్కడ ఉన్న మహిళా ఎస్ఐ ఫిర్యాదును స్వీకరించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఫిర్యాదు ఇస్తున్న సమయంలో ఫోటో తీసేందుకు అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. బీసీ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తున్న జిల్లా అధ్యక్షుడిపై ఈ విధమైన దాడి తీవ్రంగా ఖండనీయమని రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా అన్నారు. దాడికి పాల్పడిన ఎస్ఐలపై వెంటనే చట్టపర చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ జిల్లా అధ్యక్షుడికి న్యాయం జరగకపోతే తాను స్వయంగా సిరిసిల్లకు వచ్చి ధర్నా నిర్వహిస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. టీఆర్‌పీ కార్యకర్తలపై దాడులు జరిగితే ఊరుకునేది లేదని, న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ పరిధిలో ఉన్న రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభ మవుతాయని చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 9.30 గంటలకు శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించ బడుతుందని, అనంతరం రాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజతో పాటు శివపార్వతుల పంచలోహ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని చైర్మన్ సామల బిక్షపతి కోరారు.

# వేములవాడలో కాంగ్రెస్ సంబరాలు

- మున్సిపల్ కార్యాలయం ఎదుట బాణాసంచా హోరు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ మున్సిపాలిటీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. మున్సిపల్ కార్యాలయంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడంతో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గుమిగూడి బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడంతో మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ, ఇది కార్యకర్తల కష్టానికి, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. వేములవాడ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ

- ప్రతి ఒక్కరూ కేవైసీ అప్డేట్ చేసుకోవాలి
- ఎస్బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జన్ను మహేందర్

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ వీక్ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జన్ను మహేందర్ హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మారపెల్లి క్రాంతి కుమార్ అధ్యక్షత వహించారు. బీసీ కాలనీ నుంచి బస్టాండ్ కూడలి వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పాల్గొని కేవైసీ అప్డేట్, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జన్ను మహేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాలకు కేవైసీ తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గుర్తు తెలియని లింకులు ఓపెన్ చేయరాదని, ఆన్‌లైన్ గేమ్స్, అనధికార లోన్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మార్కెట్ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ మదన్ గోపాల్, గ్రామ పెద్ద చింతల రవిపాల్, ఉపసర్పంచ్ దైనంపెల్లి సుమన్, గురుకుల పాఠశాల విద్యార్థులు, విడ్స్ కౌన్సిలర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వీసెస్‌కు సంసిద్ధత వ్యక్తిత్వ వికాసానికి బాట

- బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ

**వేద న్యూస్, హైదరాబాద్:**




సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవడం కేవలం ఉద్యోగ సాధనకే పరిమితం కాదని, అది వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, సమయపాలన, జీవన నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడుతుందని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వ సిటీ కాలేజీలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ నూతన బ్యాచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమవడం ద్వారా ప్రపంచంపై సమగ్ర అవగాహన పెరగడమే కాక, వ్యక్తి తన సామర్థ్యాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆకాంక్షకులకు కన్విక్షన్, కమిట్‌మెంట్, కమ్యూనికేషన్ అనే మూడు 'సి'లు అత్యంత ముఖ్యమని నొక్కిచెప్పారు. విద్య సమగ్ర అభివృద్ధికి దోహదపడాలని, మేధస్సు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలతో కూడిన వ్యక్తులే ఉత్తమ నిర్వాహకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిల్ భవిష్యత్ బ్యూరోక్రాట్లను తీర్చిదిద్దే కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. విప్లవ దత్ శుక్లా మాట్లాడుతూ లక్ష్యసాధనలో పట్టుదల, క్రమశిక్షణ కీలకమని తెలిపారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ డా. బాలకృష్ణ శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**వేద న్యూస్, క్యాతనపల్లి:**





జిల్లాలో జరిగిన 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం క్యాతనపల్లి, బెల్లంపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ప్రత్యేక అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కోసం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీలలో కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులను రాండమైజేషన్ ద్వారా నియమించినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసి, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు.

# స్టేట్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే సందర్భంగా ఎగ్జిబిషన్

**వేద న్యూస్, చందుర్తి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సరోజిని నాయుడు జయంతి సందర్భంగా స్టేట్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే పురస్కరించుకుని ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఓరుగంటి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో రాణించేందుకు ఆంగ్ల భాష ఒక ముఖ్యమైన సాధనమని, విద్యార్థులు చదవడం, రాయడం, మాట్లాడడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సరోజిని నాయుడు ఆంగ్ల భాషను సమర్థంగా ఉపయోగించి స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. రజిత, ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరుమలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# నర్సంపేట-కొండాపూర్‌కు బస్సు సౌకర్యం

**వేద న్యూస్, నల్లబెల్లి:**




నర్సంపేట నుంచి మద్ది మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కొండాపూర్ వరకు టీఎస్ ఆర్టీసీ కొత్త బస్సు సేవను ప్రారంభించింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీకి మద్దిమేడారం ప్రధాన పూజారి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ బస్సు సేవ భక్తులకు ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కొండాపూర్ పరిసర గ్రామాల నుంచి నర్సంపేటకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులు, ఆసుపత్రులకు వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు సేవ ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. జాతర సీజన్‌లో మరిన్ని బస్సులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే సత్యంకు ఆహ్వానం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి మహోత్సవాలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గ్రామ ప్రజలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే విలాసాగర్‌కు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. దేవస్థానంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజలు చైతన్యవంతమైన నిర్ణయం తీసుకున్నారు



**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**

**వేద న్యూస్, శాయంపేట:**

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతమైన నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ పార్టీకి విజయం అందించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శాయంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రంగులు చల్లుకుని, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనపై విశ్వాసంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు కూడా అహంకారం విడిచిపెట్టి అభివృద్ధి కోసం సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారేపల్లి రవీందర్, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, చిందం రవి, నిమ్మల రమేష్, పోతు కృష్ణమూర్తి, మస్కే కుమారస్వామి, తిరుపతి, ఎడ్ల సుధాకర్, రఫీ, రాజకుమార్, శంకరాచారి, వీరన్న, మార్కండేయ, వరదరాజు, కట్టయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ బాలికల ఉన్నత పాఠశాలలో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో రంగోళి, క్విజ్, నాటికలు, చిత్రలేఖనం, వ్యాసరచన, హ్యాండ్‌రైటింగ్, ఉపన్యాసం వంటి పలు పోటీలు నిర్వహించగా, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయురాలు వాణి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో రాణించాలంటే ఆంగ్ల భాషపై పట్టు సాధించడం అవసరమని, ఆంగ్లం నేడు అంతర్జాతీయ భాషగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేవతి, సంపత్ కుమార్, శ్రీధరాచారి, నయీమ్ పాషా, కొమురయ్య, కిరణ్, కోమల, పాపయ్య, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



# లారీ బోల్తా.. డ్రైవర్ మృతి

**- శాయంపేట మండలంలో ఘటన**

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం గోవిందాపూర్ శివారులో లారీ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం, శాయంపేట గ్రామానికి చెందిన కొలగాని దేవేందర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కాజీపేట నుంచి తిరిగి గోవిందాపూర్ సమీపంలోని బాలాజీ రోబో శాండ్‌కు వెళ్తున్న సమయంలో మందారిపేట గ్రామ శివారులో పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించేందుకు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ లారీ కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అతడిని పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ దేవేందర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్సై జక్కుల పరమేష్ పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుడి తల్లి కొలగాని రమ నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్, స్వతంత్ర అభ్యర్థులు

**- కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**





**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ నరాల శేఖర్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులు కుమ్మరి శిరీష, ఆలే (టైలర్) శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రజలు మార్పును కోరుకుంటున్నారనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# నాటు సారా నిర్మూలనకు ఆకస్మిక దాడులు

**- 800 లీటర్ల చక్కెర పానకం ధ్వంసం, నలుగురిపై కేసులు**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లబెల్లి మండలంలోని నందిగామ, రేలకుంట, లెంకాలపల్లి గ్రామాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా ఈ దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో మొత్తం 800 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారీకి పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నాటు సారా నిర్మూలన కోసం ఇలాంటి దాడులు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ చందర్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగరాజు, ట్రైనీ ఎస్సై సురేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# కెమిస్ట్రీ విభాగం జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 16, 17 తేదీలలో నిర్వహించనున్న "కరెంట్ రీసెర్చ్ ఇన్ కెమికల్ సైన్సెస్" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ... ఈ సదస్సు ద్వారా రసాయన శాస్త్రంలో తాజా పరిశోధన ధోరణులు, ఆధునిక ఆవిష్కరణలపై శాస్త్రవేత్తలు, అధ్యాపకులు చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య జి. హనుమంతు, ఆచార్యులు టి. సవితా జ్యోత్స్న, ఎస్. జ్యోతి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య బి. రమ, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, డాక్టర్ కె. మమత, డాక్టర్ ఎస్. రంగారెడ్డి, డాక్టర్ ఎన్. శ్రీనివాస్, డాక్టర్ కవిత, డాక్టర్ వినుత, డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ సృజన తదితర బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంగ్ల ఉపాధ్యాయునికి సన్మానం

**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**



ఆదిలాబాద్ జిల్లా అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ ఏఎంఓ, ఎస్-ఎస్ఏ అజయ్ హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆంగ్ల బోధనలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు మార రవికాంత్ రెడ్డిని సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సన్మానం తనకు మరింత ప్రేరణనిస్తుందని, ఆంగ్ల భాషాభివృద్ధికి కృషి కొనసాగిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రసంగాలు, పదజాల ఆటలు, క్విజ్ పోటీలు, పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, రాజన్న, హరికతో పాటు బోధనేతర సిబ్బంది దత్తు, రుతిక, స్వప్న, వీణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ విజయవంతం



**వేద న్యూస్, కారేపల్లి:**

మండల పరిధిలోని గాదెపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతులు, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలుపై గ్రామస్తులతో ముఖాముఖి చర్చించారు. ప్రతి వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నన్నే బోయిన ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి కుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని తమ సమస్యలను వెల్లడించారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

# చీమలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేత

**- గ్రామాల ప్రజలు సహకరించాలి: విద్యుత్ శాఖ**

**వేద న్యూస్, కారేపల్లి:**

విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మత్తుల దృష్ట్యా చీమలపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ మాణిక్యారం ఫీడర్ లైన్‌లో అత్యవసర మరమ్మత్తులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెత్రునగర్, గుడి తండా, ఎర్రబోడు, మాణిక్యారం, గాదెపాడు గ్రామాల్లో గృహ వినియోగం, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, మరమ్మత్తులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

# చైన్ స్నాచర్ల అరెస్ట్

**- మూడు తులాల బంగారు గొలుసు స్వాధీనం**

**- టేక్మాల్ ఎస్ఐ అరవింద్ వెల్లడి**




**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు. వివరాల ప్రకారం తంప్లూర్ గ్రామానికి చెందిన శ్యామల అనే మహిళ పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును అపహరించి పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, సమాచార సేకరణ ఆధారంగా నిందితులైన పాపయ్య, పోచయ్యలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన మూడు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చైన్ స్నాచింగ్ ఘటనలు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ అరవింద్ సూచించారు.

# కేయూ ప్రతిష్టను మరింత పెంపొందించాలి

**– వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

నాణ్యమైన బోధనతో పాటు సమగ్ర పరిశోధన కార్యక్రమాలను కొనసాగిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింతగా పెంపొందించాలని వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. విశ్వ విద్యాలయ బోధనా సిబ్బందికి కెరీర్ అడ్వాన్స్మెంట్ స్కీం (సి.ఏ.ఎస్) కింద పదోన్నతులు మంజూరు చేసిన సందర్భంగా, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సమక్షంలో పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు ఆచార్యులకు సీనియర్ ప్రొఫెసర్ హోదా, తొమ్మిది మంది సహ ఆచార్యులకు ప్రొఫెసర్ హోదా, 29 మంది సహాయ ఆచార్యులకు అసోసియేట్ ప్రొఫెసర్ హోదా, ముగ్గురు సహాయ ఆచార్యులకు సెలక్షన్ గ్రేడ్, ఇద్దరు సహాయ ఆచార్యులకు సీనియర్ స్కేల్ పదోన్నతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ బాధ్యులు ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఉప రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్, అడ్మినిస్ట్రేషన్ విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు కేయూకు వర్కింగ్ డే

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

సమ్మక్క–సారలమ్మ మేడారం జాతర సందర్భంగా జనవరి 30వ తేదీన కాకతీయ విశ్వ విద్యాలయానికి సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సెలవుకు బదులుగా ఫిబ్రవరి 14వ తేదీ రెండవ శనివారాన్ని పనిదినంగా ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. ఈ మేరకు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు విధిగా తమ విధులకు హాజరుకావాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

# ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం

**– ప్రొఫెసర్ ఎం. విద్యాసాగర్ రెడ్డి**




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలనా శాస్త్రం, మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత ఉపన్యాస కార్యక్రమం రెండో రోజు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విభాగం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఎం. విద్యాసాగర్ రెడ్డి ముఖ్య ఉపన్యాసం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ నేపథ్యంలో చేపట్టిన ఆర్థిక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు బలహీనపడటంతో పాటు అనేక మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ రెన్యువల్ ఫండ్, ఉద్యోగ సహాయ కేంద్రాల ద్వారా శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పెద్దమళ్ళ శ్రీనివాసరావు, విభాగాధిపతి డా. ఆకుతోట శ్రీనివాసులు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా. చీకటి శ్రీను, డా. బుర్రి ఉమశంకర్, డా. వడ్డేపల్లి మోహన్, డా. దేవేంద్ర చారి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మంలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

- 7 మున్సిపాలిటీలపై హస్తం పాగా
- మధిరలో 18 వార్డులతో స్పష్టమైన ఆధిక్యం
- కొత్తగూడెం కార్పొరేషన్‌లో హంగ్.. సీపీఐకి బీఆర్ఎస్ మద్దతు




**వేద న్యూస్ ఖమ్మం:**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. జిల్లాలోని అశ్వారావుపేట, ఇల్లెందు, కల్లూరు, మధిర, సత్తుపల్లి, వైరా, ఎదులాపురం మున్సిపాలిటీలను హస్తం పార్టీ కైవసం చేసుకుంది. అన్ని మున్సిపాలిటీల్లో స్పష్టమైన ఆధిక్యంతో కాంగ్రెస్ సత్తాచాటింది. అశ్వారావుపేటలో 22 వార్డులకు గానూ కాంగ్రెస్ 17 వార్డులు గెలుచుకోగా, భారత రాష్ట్ర సమితి 2, భారతీయ జనతా పార్టీ 1, ఇతరులు 2 స్థానాల్లో విజయం సాధించారు. ఇల్లెందులో 24 వార్డుల్లో కాంగ్రెస్ 19 గెలుచుకుని ఆధిపత్యం చాటింది. కల్లూరులో 20 వార్డుల్లో 12 స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోగా, బీఆర్ఎస్ 6, బీజేపీ 1, ఇతరులు 1 స్థానాల్లో గెలిచారు. ఉప ముఖ్యమంత్రి మల్లూ భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిరలో కాంగ్రెస్ ఘన విజయాన్ని నమోదు చేసింది. 22 వార్డుల్లో 18 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. బీఆర్ఎస్ ఒకటి, ఇతరులు మూడు వార్డులు గెలిచారు. వైరా, మధిర, ఎదులాపురం, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో మొత్తం 117 వార్డులకు గానూ 83 వార్డుల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో 46 వార్డులకు 36 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ఇక కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఆసక్తికర పరిస్థితి నెలకొంది. 60 డివిజన్లకు జరిగిన ఎన్నికల్లో సీపీఐ 24, కాంగ్రెస్ 20, బీఆర్ఎస్ 9, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 5 చోట్ల విజయం సాధించారు. మేయర్ పీఠం కోసం 31 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరముండగా, సీపీఐకి మద్దతు ఇస్తామని కేటీఆర్ ప్రకటించారు. దీంతో మేయర్ పదవి సీపీఐ ఖాతాలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబరాలు నిర్వహించి విజయోత్సవ ర్యాలీలు చేపట్టారు. జిల్లాలో కాంగ్రెస్ పట్టు మరింత బలపడినట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

# ఖనిజ సంపదలను కార్పొరేట్లకు కట్టబెట్టొద్దు

**– అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్**

**వేద న్యూస్, కారేపల్లి:**

అడవులు, అటవీ ఖనిజ సంపదలను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గేట్ కారేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సహజ వనరులు, ఖనిజ సంపదపై ఈ దేశ ప్రజలకే హక్కు ఉందన్నారు. మైనింగ్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, పర్యాటక కేంద్రాల పేరుతో ఆదివాసులను అడవుల నుంచి వెలివేయడం అన్యాయమని ఆరోపించారు. రైతులు, కార్మికులు, ఆదివాసుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, వారి జీవనోపాధిపై ప్రభావం చూపే నిర్ణయాలను




పునఃపరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి పోలురి శ్రీనివాసరావు, సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్, జిల్లా నాయకులు సుంకర బుచ్చయ్య, దంతాల నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# సేవకుడిగా పని చేస్తా..

**– 9 వ వార్డు కౌన్సిలర్ రాము పొనగంటి**

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని తొమ్మిదో వార్డు కౌన్సిలర్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి పొన్నగంటి రాము విజయం సాధించారు. కారు గుర్తుకు ఓటు వేసి తన ను ఆశీర్వదించి గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన అభ్యర్థి రామును ఓటర్లు అక్కున చేర్చుకుని.. విజయం నీదే అంటూ భరోసాను ఇచ్చారు.

**ముందే చెప్పిన 'వేద న్యూస్'**

ఈ క్రమంలోనే వేద న్యూస్ తెలుగు దినపత్రిక ముందే బీఆర్ఎస్ కౌన్సిలర్ కౌన్సిలర్ గెలుపు పై వార్త కథనం ప్రచురించింది. 'విజయం నీదే' శీర్షికన 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ఈ


వేద న్యూస్
2026-02-06
https://epaper.vedhanews.in/

విజయం నీదే..

- భరోసానిస్తున్న ఓటర్లు
- గడపగడపకు తిరిగి ప్రచారం చేస్తున్న పొనగంటి రాము
- 9వ వార్డు బీఆర్ ఎస్ కౌన్సిలర్ అభ్యర్థికి అపూర్వ ఆదరణ
- ప్రచార పర్వంలో ముందు వరుసలో గులాబీ దళం

వేద న్యూస్, జమ్మికుంట:

నెల 6న స్టోరీ పబ్లిష్ చేయగా, అది అక్షర సత్యమైంది. 531 ఓట్లతో పొనగంటి రాము జమ్మికుంట మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.

# 'మెడికవర్' ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

**వేద న్యూస్ వేములవాడ ప్రతినిధి**

చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారిచే రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కొమ్ము విద్యాసాగర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ షహనాజ్ సమీర్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ మెగా వైద్య శిబిరంలో సుమారుగా 200 మందికి పైగా ప్రజలకు బిపి, జిఆర్బిఎస్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి డాక్టర్ గారు ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యలపై సలహాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అధిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రికి రావాలని ఆసుపత్రి సిబ్బంది కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షహనాజ్ సమీర్ మాట్లాడుతూ కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారు నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇట్టి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఆసుపత్రి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కొమ్ము సాగర్ మాట్లాడుతూ, ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి సహకరించి విజయవంతం చేసినందుకు గ్రామ సర్పంచ్ కి మరియు పాలకవర్గానికి గ్రామపంచాయతీ సిబ్బందికి మరియు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిర



ఏర్పాటు నిర్వహణకు సహకరించిన కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, టీం లీడర్ దాసరి శ్రీకాంత్ మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి సిబ్బంది మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కొమ్ము విద్యాసాగర్, క్యాంపు కోఆర్డినేటర్ వేముల శ్రీకాంత్ మరియు నర్సింగ్ సిబ్బంది, గ్రామ యూత్ నాయకులు అందాసు రమేష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి భారీ బందోబస్తు



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా 1200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జాతరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి వేములవాడలోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో విధుల నిర్వహణపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. సుదూర

**– పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ**

ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్ పాటించేలా చూడాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక క్రైమ్ పార్టీలు, మహిళల భద్రత కోసం షీ టీమ్ బృందాలు సివిల్ డ్రెస్సులో విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు, వాహనాల రాకపోకలకు రూట్ మ్యాప్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

**వేద న్యూస్, వీర్నపల్లి:**



**– వీర్నపల్లి సర్పంచ్ జ్యోత్స్న**

గ్రామాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సర్పంచ్ జ్యోత్స్న అన్నారు. వీర్నపల్లి గ్రామసభ ఆమె అధ్యక్షతన నిర్వహించగా, గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. మురుగు కాలువల శుభ్రత, చెత్త నిర్వహణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. గ్రామంలో కోతుల బెడద నివారణకు కూడా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వేముల లక్ష్మణ్, బ్యాంకు మేనేజర్ మదం సంతోష్ గ్రామస్తులకు బ్యాంకు మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీహరి, ఏపీఎం దేవరాజు, ఉప సర్పంచ్ జక్కుల నరేష్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేద న్యూస్
శనివారం ఫిబ్రవరి 14, 2026

# ప్రజలకు చక్కటి సేవలందిస్తా..


వేద న్యూస్
2026-02-07
https://epaper.vedhanews.in/

ఒగ్గు వైపు జనం మొగ్గు

- 28వ వార్డు ప్రజల ఆశీస్సులు పొందుతున్న రమేశ్
- ప్రచారంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి

వేద న్యూస్, జమ్మికుంట:

ప్రజల సంక్షేమమే ప్రధానం


వేద న్యూస్
2026-02-08
https://epaper.vedhanews.in/

జనం సంపూర్ణ విశ్వాసం చూరగొంటూ..

- 28 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ ప్రచారం
- కౌన్సిలర్ గా గెలుపు దిశగా బలమైన అడుగులు

వేద న్యూస్, జమ్మికుంట:



- కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం
- వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా
- 28 వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు రమేశ్

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 28 వ వార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఒగ్గు రమేశ్ విజయం సాధించారు. చేతి గుర్తుకు ఓటు వేసి తన ను ఆశీర్వదించి గెలిపించిన ఓటర్లకు ఈ సందర్భంగా రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన అభ్యర్థి రమేశ్‌ను ఓటర్లు అక్కున చేర్చుకునీ.. విజయం నీదే అంటూ భరోసాను ఇచ్చారు. ఆయనను గెలిపించారు. 357 ఓట్లతో ఒగ్గు రమేశ్ 28వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఒగ్గురమేశ్ గెలుపుపై 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక వరుస కథనాలను ప్రచురించింది. ఆయన గెలుపును ప్రజలు కన్ఫర్మ్ చేశారని అభిప్రాయపడింది. 'ఒగ్గు వైపు జనం మొగ్గు', 'జనం సంపూర్ణ విశ్వాసం చూరగొంటూ' వంటి శీర్షికలతో 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక వరుస కథనాలను ప్రచురించింది.

# నాకు మద్దతు తెలిపిన వారికి కృతజ్ఞతలు

- జమ్మికుంట 9 వ వార్డు కంటెస్టెడ్ కౌన్సిలర్ పీజేఆర్

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని తొమ్మిదో వార్డు కౌన్సిలర్‌గా బీజేపీ అభ్యర్థిగా తాను పోటీ చేయగా, తనకు మద్దతు తెలిపిన ప్రజలకు పీజేఆర్ (పొనగంటి రవి కుమార్) కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా తీర్పును తాను గౌరవిస్తున్నట్లు ఆయన శుక్రవారం వెల్లడించారు. ఇది అంతిమం కాదని, సేవ చేయాలనే తన సంకల్పానికి కొత్త ఆరంభం మాత్రమే అని పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి మద్దతు తెలిపిన ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు. 9 వ వార్డు అభివృద్ధి కోసం తన పోరాటం, ప్రజల కోసం సంక్షేమ, సేవా కార్యక్రమాలు ఎప్పటికీ ఆగబోవని పీజేఆర్ తెలిపారు.

## మసీదు భూమి నమోదు కోసం లంచం..

# డిప్యూటీ తహసీల్దార్ అరెస్ట్

**వేద న్యూస్ అమరావతి:**



మసీదుకు చెందిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు లంచం తీసుకున్న డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కడప జిల్లా పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగేంద్ర ప్రసాద్ రూ. 10 వేల లంచం స్వీకరిస్తుండగా అధికారులు దాడి చేసి అరెస్ట్ చేశారు. చక్రాయపేట మండలం కుమారకాల్వ గ్రామంలో మసీదుకు చెందిన 36 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ మసీదు కమిటీ సభ్యులు అధికారులను సంప్రదించినట్లు సమాచారం. అయితే భూమి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలంటే లంచం ఇవ్వాలని నాగేంద్రప్రసాద్ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు కరీముల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పన్నిన ఉచ్చులో అధికారి చిక్కుకున్నాడు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ డీఎస్పీ సీతారామారావు ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడ్డ అధికారిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో రెవెన్యూ శాఖలో కలకలం రేగింది.

# మహిళలను అవమానించే వ్యాఖ్యలు సరికాదు



- అంబటి వ్యాఖ్యలపై తీవ్ర ఆక్షేపణ మంత్రి అనిత
- ఆరోపణలకు ఆధారాలు ఇవ్వాలని సవాల్
- రెచ్చగొట్టే వ్యాఖ్యలకు సమాధానం ఏమిటని ప్రశ్న

**వేద న్యూస్ అమరావతి:**

మహిళలను అవమానించేలా మాట్లాడిన నేతలు సమాజానికి తప్పు సందేశం ఇస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఇటీవలి వ్యాఖ్యలపై స్పందిస్తూ అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. గౌరవమైన సభల్లో అలాంటి నేతల కోసం మాట్లాడడం అవసరమా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు తల్లి గురించి మాట్లాడారని ఆరోపణలు చేస్తున్నారని, అయితే అందుకు ఆధారాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రాజకీయాలు సమాజానికి మేలు చేయవని అనిత పేర్కొన్నారు. అంబటి వ్యాఖ్యలకు వైసీపీ నేతలు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం అవసరమని, మహిళలను అవమానించే విధంగా మాట్లాడడం అంగీకారయోగ్యం కాదని ఆమె స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ శ్రామికుల ఆవేదన వర్ణనాతీతం

- ప్రకాశం జిల్లాలో ఎంజీఎన్ఆర్ఈజీఏ పరిరక్షణ యాత్ర వైఎస్ షర్మిల
- పాకల గ్రామంలో రచ్చబండ కార్యక్రమం
- వేతనాలు, పనిదినాలపై శ్రామికుల ఆవేదన

**వేద న్యూస్ అమరావతి:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర నేడు ప్రకాశం జిల్లాలో కొనసాగింది. కొండెపి నియోజకవర్గంలోని పాకల గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో శ్రామికులు తమ సమస్యలను వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ షర్మిల మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికుల ఆవేదన వర్ణనాతీతమని పేర్కొన్నారు. శ్రామికులు మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కరువు పనులు పండుగలా సాగేవని తెలిపారు. రవాణా చార్జీలతో పాటు పనులు జరిగే ప్రదేశాల్లో మంచినీళ్లు, మజ్జిగ, రస్నా వంటి సదుపాయాలు కల్పించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం వందరోజుల హామీ ఉన్నప్పటికీ సగం రోజులు కూడా పని దొరకడం లేదని, చేసిన పనులకు వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు.



పాకల గ్రామ ప్రజలు ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం కొనసాగాలని, దీనిని బలహీనపరచే చర్యలు తీసుకోవద్దని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పరిరక్షణ పోరాటానికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు. చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు జీవనాధారమని, శ్రామికులకు సమయానికి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణాభివృద్ధి కోసం ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

# విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు పెంచుకోవడం అత్యవసరం..!

**వేద న్యూస్ రాయపోల్ :**



ప్రస్తుత గ్లోబల్ యుగంలో విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు పెంచుకోవడం అత్యంత అవసరమని ఇంగ్లీష్ ఉపాధ్యాయులు నర్సింలు గౌడ్, సంజీవులు అన్నారు. రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇంగ్లీష్ డే నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఇంగ్లీష్ భాష ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు రంగవల్లులు వేయగా, సందేశాత్మక చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఇంగ్లీష్ డేను పునస్కరించుకొని విద్యార్థులు ఇంగ్లీష్‌లో ప్రసంగాలు ఇచ్చారు. కొందరు కవితా పఠనం, సంభాషణలు, వ్యాసరచన వంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, సాంకేతిక రంగాల్లో రాణించాలంటే ఇంగ్లీష్ భాషలో నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. రోజువారీ జీవితంలో ఇంగ్లీష్ మాట్లాడే అలవాటు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ప్రమీల ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఇంగ్లీష్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

# పుల్వామా అమర వీరుల స్మరణ దినం

- దేశ రక్షణలో అర్పించిన అమూల్య ప్రాణాలకు వినమ్ర నివాళి
- త్యాగం, ధైర్యం, సేవ భావానికి చిరస్థాయి స్మారకం

**వేద న్యూస్ డెస్క్:**

దేశం సురక్షితంగా నిద్రపోవాలంటే సరిహద్దుల్లో ఎవరో మేల్కొని ఉండాలి. ఆ బాధ్యతను నిశ్శబ్దంగా భుజాన వేసుకునే వారు మన జవాన్లు. తమ కుటుంబాలను, వ్యక్తిగత ఆశలను, సౌకర్యాలను పక్కనపెట్టి దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమించే వారి సేవ అమూల్యం. అలాంటి వీర జవాన్ల త్యాగాన్ని స్మరించుకునే రోజే పుల్వామా అమర వీరుల స్మరణ దినం. ఈ రోజు కేవలం ఒక ఘటనను గుర్తు చేసేది కాదు. దేశభక్తి, అంకితభావం, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన అమరుల జ్ఞాపకాలను మళ్లీ మన ముందుకు తెస్తుంది.

పుల్వామా ఘటన దేశాన్ని ఒక్కసారిగా కుదిపేసింది. విధి నిర్వహణలో ఉన్న జవాన్ల ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద సంఘటన ప్రతి భారతీయుడి హృదయాన్ని కదిలించింది. ఆ రోజు దేశం ఒక్కటైంది. వేదన, ఆగ్రహం, గౌరవం భావాలు కలిసిపోయాయి. అమరుల కుటుంబాల బాధను దేశం తనదిగా భావించింది. వీరుల త్యాగం దేశ చరిత్రలో చెరగని అక్షరాలుగా నిలిచింది.

జవాన్ల జీవితం సులభం కాదు. తీవ్ర చలి, ఎండ, వర్షం, ప్రమాదకర పరిస్థితులు ఇవన్నీ వారి దైనందిన జీవితంలో భాగమే. కుటుంబం దూరంగా ఉండి, కర్తవ్యాన్ని ముందుగా ఉంచి సేవ చేయడం వారి ధర్మం. దేశ భద్రతే వారి లక్ష్యం. ఆ లక్ష్యం కోసం వారు ప్రాణత్యాగానికీ సిద్ధమవుతారు. పుల్వామా అమర వీరులు ఆ త్యాగానికి నిదర్శనం.

ఈ స్మరణ దినం మనకు ఒక ప్రశ్నను కూడా వేస్తుంది. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరులకు మనం ఎలా కృతజ్ఞత చెల్లించాలి? కేవలం నివాళులు అర్పించడం సరిపోతుందా? వారి కుటుంబాలకు అండగా నిలవడం, వారి త్యాగాన్ని గౌరవించే సమాజాన్ని నిర్మించడం, దేశ ఐక్యతను కాపాడుకోవడ ఇవే నిజమైన నివాళి. జవాన్లు సరిహద్దుల్లో కాపలా కాస్తే, పౌరులుగా మనం దేశంలో క్రమశిక్షణ, బాధ్యత, ఐక్యతను పాటించాలి. యువతకు ఈ రోజు ఒక స్ఫూర్తి.

దేశ సేవ అంటే కేవలం సైన్యంలో చేరడం మాత్రమే కాదు. ప్రతి రంగంలోనూ నిజాయితీగా పని చేయడం, దేశ ప్రయోజనాలను ముందుంచడం, సమాజానికి మేలు చేయడం దేశభక్తి రూపాలే. అమర వీరుల త్యాగం మనలో ఆ భావాన్ని బలపరచాలి. పుల్వామా అమర వీరుల స్మరణ దినం ఒక విషాద జ్ఞాపకం మాత్రమే కాదు. అది ఒక గౌరవ సూచకం. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారి ధైర్యాన్ని, అంకితభావాన్ని గుర్తు చేసే రోజు. వారి త్యాగం వృథా కాకుండా దేశాన్ని మరింత బలంగా, ఐక్యంగా నిలబెట్టడం మన బాధ్యత. మొత్తంగా ఈ రోజు మన హృదయాల్లో గౌరవాన్ని, కృతజ్ఞతను నింపుతుంది. అమరుల త్యాగం ఎప్పటికీ మరువలేనిది.

వారి ధైర్యం తరతరాలకు స్ఫూర్తి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పుల్వామా అమర వీరులకు శత శత నమనాలు. వారి జ్ఞాపకం భారత మన్నులో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అమర వీరుల త్యాగం మనకు ఒక బాధ్యతను గుర్తు చేస్తుంది. దేశం పట్ల కర్తవ్యాన్ని నిర్వర్తించడం ప్రతి పౌరుడి బాధ్యత. జవాన్లు సరిహద్దుల్లో కాపలా కాస్తే, పౌరులు దేశంలో క్రమశిక్షణ, ఐక్యత, నిబద్ధతను పాటించాలి. వారి త్యాగం వృథా కాకుండా దేశాన్ని బలంగా నిలబెట్టడం మన కర్తవ్యం.

పుల్వామా అమర వీరుల స్మరణ దినం కేవలం ఒక రోజు కార్యక్రమంగా మిగలకూడదు. ఇది దేశభక్తిని మళ్లీ మళ్లీ గుర్తు చేసే సందర్భం. యువతకు స్ఫూర్తినిచ్చే రోజు. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన జవాన్ల కుటుంబాలకు మనం అండగా నిలవాల్సిన అవసరాన్ని గుర్తు చేసే రోజు.

మొత్తంగా ఈ రోజు మన హృదయాల్లో గౌరవాన్ని, కృతజ్ఞతను నింపుతుంది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులకు శత శత నమనాలు. వారి త్యాగం ఎప్పటికీ మరువలేనిది. వారి ధైర్యం, సేవ భావం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. పుల్వామా ఘటన దేశాన్ని ఒక్కసారిగా కుదిపేసింది. విధి నిర్వహణలో ఉన్న జవాన్ల ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద సంఘటన ప్రతి భారతీయుడి హృదయాన్ని కదిలించింది. ఆ రోజు దేశం ఒక్కటైంది. వేదన, ఆగ్రహం, గౌరవం భావాలు కలిసిపోయాయి. అమరుల కుటుంబాల బాధను దేశం తనదిగా భావించింది. వీరుల త్యాగం దేశ చరిత్రలో చెరగని అక్షరాలుగా నిలిచింది.

జవాన్ల జీవితం సులభం కాదు. తీవ్ర చలి, ఎండ, వర్షం, ప్రమాదకర పరిస్థితులు ఇవన్నీ వారి దైనందిన జీవితంలో భాగమే. కుటుంబం దూరంగా ఉండి, కర్తవ్యాన్ని ముందుగా ఉంచి సేవ చేయడం వారి ధర్మం. దేశ భద్రతే వారి లక్ష్యం. ఆ లక్ష్యం కోసం వారు ప్రాణత్యాగానికీ సిద్ధమవుతారు. పుల్వామా అమర వీరులు ఆ త్యాగానికి నిదర్శనం.

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 14, 2026

# రిస్క్ తగ్గించే ప్లాన్‌లో రవితేజ

## కొత్త బిజినెస్ మోడల్ చర్చనీయాంశం

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్ మాస్ మహా రాజా రవితేజ తన కెరీర్‌లో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వరుసగా వచ్చిన పరాజయాలు, మారుతున్న మార్కెట్ పరిస్థితులు, ఓటీటీ హక్కుల విలువల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో నిర్మాతలపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించే దిశగా ఆయన అడుగులు వేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక్కో సినిమాకు రూ.20 నుంచి 25 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్న రవితేజ, ప్రస్తుతం ఫిక్స్‌డ్ రెమ్యూనరేషన్‌ను కొంతవరకు తగ్గించి, సినిమా లాభాల్లో వాటా తీసుకునే 'ప్రాఫిట్ షేరింగ్ మోడల్' వైపు మొగ్గు చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ విధానం ద్వారా సినిమా ప్రారంభ దశలో నిర్మాతలపై పెట్టుబడి ఒత్తిడి తగ్గుతుండగా, సినిమా విజయవంతమైతే లాభాల్లో హీరోకు వాటా లభించే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో భారీ బడ్జెట్ సినిమాలపై నిర్మాతలు జాగ్రత్తగా వ్యవహరిస్తుండటంతో, ఈ నిర్ణయం ఇండస్ట్రీలో సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. ఒకవేళ సినిమా ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా నిర్మాతలకు నష్టం తగ్గే అవకాశముందని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో మారుతున్న మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నాని, సాయి ధరమ్ తేజ్, నందమూరి బాలకృష్ణ వంటి హీరోల ప్రాజెక్టుల విషయంలో కూడా ఇలాంటి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. తన మార్కెట్‌ను కాపాడుకుంటూనే నిర్మాతలకు భరోసా కల్పించేలా రవితేజ తీసుకున్న ఈ కొత్త బిజినెస్ మోడల్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విధానం ఆయన తదుపరి సినిమాలకు ఎంతవరకు ప్లస్ అవుతుందో చూడాల్సి ఉంది.

# లిటిల్ హార్ట్స్‌తో భారీ విజయం..

## ఎక్కువ సినిమాలు చేయకపోవడానికి ఇదే కారణమంటున్న శివానీ నాగారం

**వేద న్యూస్ డెస్క్:**



ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై అనూహ్య విజయాన్ని అందుకున్న లిటిల్ హార్ట్స్ చిత్రంతో నటి శివానీ నాగారం ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే సమీకరణ స్థాయిని దాటడం విశేషంగా నిలిచింది. ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించిన మౌళి, శివానీ నాగారం, జయకృష్ణలకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా శివానీ నటనకు మంచి గుర్తింపు వచ్చింది. చిన్న చిత్రాల ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన శివానీ, ఒకే సినిమాతో మంచి పేరు సంపాదించింది. ప్రస్తుతం ఆమె హే భగవాన్ సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. 2024లో నటిగా మంచి ఆరంభం లభించిందని, 2025 నాటికి ప్రేక్షకుల మద్దతు పెరిగిందని, 2026లో పూర్తిస్థాయి వాణిజ్య కథానాయికగా ఎదుగుతున్నాననే భావన కలుగుతోందని తెలిపింది. తాను ఎక్కువ సినిమాలు చేయకపోవడానికి కారణం కూడా వివరించింది. "ఎన్ని సినిమాలు చేశామన్నది కాదు, మంచి కథ ఉన్న చిత్రాల్లో నటించడమే ముఖ్యమని నమ్ముతాను. నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తాను" అంటూ స్పష్టం చేసింది. మంచి కథలు, బలమైన పాత్రలు ఉంటేనే ఒప్పుకుంటానని తెలిపింది. ప్రస్తుతం చేస్తున్న 'హే భగవాన్' చిత్రం గురించి మాట్లాడుతూ, ఇందులో ఓ ఆసక్తికరమైన రహస్య అంశం ఉందని, అది కథలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పింది. సినిమా మొదటి భాగంలోనే ఆ రహస్యం బయటపడుతుందని, ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగిస్తుందని వెల్లడించింది. ఈ చిత్రంలో తాను సంప్రదాయ కుటుంబానికి చెందిన యువతిగా కనిపిస్తానని, నటిగా ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందని తెలిపింది. సినిమాలు, వెబ్ కథలు రెండూ సమానంగా ముఖ్యమని, ప్రేక్షకులను అలరించే పాత్రలు చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పింది. తెలుగు అమ్మాయిలు కూడా చిత్రసీమలోకి వచ్చి మంచి విజయాలు సాధించాలని కోరుకుంటున్నానని, కుటుంబ సభ్యుల ప్రోత్సాహమే తనకు బలమని శివానీ నాగారం పేర్కొంది.

# గ్లామర్ అంటే ప్రదర్శన కాదు.. మానస వారణాసి ఆసక్తికర వ్యాఖ్యలు



**వేద న్యూస్ డెస్క్:**

మాజీ మిస్ ఇండియా మానస వారణాసి కథానాయికగా తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. దేవక నందన వాసుదేవ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె తొలి ప్రయత్నం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినప్పటికీ, తన నటనతో పాటు అందంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. మొదటి సినిమా తర్వాత కథల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న మానస, ఇప్పుడు కొత్త చిత్రంతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఆమె నటించిన కపుల్ ఫ్రెండ్లీ చిత్రం విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రచార కార్యక్రమాల్లో మానస చురుకుగా పాల్గొంటోంది. ఈ సందర్భంగా ఆమె చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా సాదాసీదా చీరకట్టులో కనిపిస్తూ తన సహజ అందంతో అభిమానులను ఆకట్టుకుంటున్న మానస, గ్లామర్‌పై తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. చిత్రంలోని ప్రేమ సన్నివేశాల గురించి మాట్లాడుతూ, కథ వినిపించిన సమయంలోనే ఇది ప్రేమకథ అని, కొన్ని సన్నివేశాలు ఉంటాయని ముందుగానే చెప్పారని తెలిపింది. మొదట కొంత ఆలోచించినప్పటికీ, చిత్ర బృందం ఎంతో వృత్తిపరంగా వ్యవహరించడంతో తనకు నమ్మకం కలిగిందని పేర్కొంది. దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, సహనటులు అందరూ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించారని చెప్పింది. ఒక మంచి చిత్రాన్ని రూపొందించాలనే లక్ష్యంతో పనిచేసే బృందంలో భాగంగా నటిగా తాను కూడా బాధ్యతగా వ్యవహరించానని మానస వివరించింది. ప్రేమ సన్నివేశాలను అసభ్యంగా కాకుండా అందంగా, భావోద్వేగంతో చూపించే ప్రయత్నం చేశారని తెలిపింది. "గ్లామర్ అంటే ప్రదర్శన కాదు. పాత్రకు అవసరమైన అందం, భావం, వ్యక్తీకరణే నిజమైన గ్లామర్" అని ఆమె స్పష్టం చేసింది. మొదటి సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, కొత్త కథలతో ప్రేక్షకుల ముందుకు రావాలనే ఉత్సాహం తనలో ఉందని మానస తెలిపింది. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు యువతలో చర్చనీయాంశంగా మారాయి. కొత్త చిత్రంతో మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 'జైలర్ 2' రిలీజ్‌పై సందిగ్ధం

## ఆగస్ట్‌లో నానితో బాక్సాఫీస్ పోటీ తప్పదా?



**వేద న్యూస్ డెస్క్:**

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా వచ్చిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జైలర్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ రూపొందించిన ఈ చిత్రం దాదాపు రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించి తలైవా కెరీర్‌లోనే బెస్ట్ హిట్స్‌లో ఒకటిగా నిలిచింది. దీంతో ఇప్పుడు సీక్వెల్ 'జైలర్ 2' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదట ఈ సినిమాను జూన్ 12న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం రిలీజ్ వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. షూటింగ్ చివరి దశలో ఉండగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ప్రమోషన్స్ వంటి కారణాలతో విడుదల తేదీ మారవచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారన్న టాక్ వినిపిస్తున్నప్పటికీ, అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. ఈ సీక్వెల్‌లో మొదటి భాగంలో నటించిన కీలక తారాగణమే మళ్లీ కనిపించనున్నారు. రజనీకాంత్‌కు జోడిగా రమ్యకృష్ణ నటించగా, ముఖ్య పాత్రల్లో ఎస్ జే సూర్య, యోగి బాబు, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, శివరాజ్ కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తుండగా, సన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.మొదటి భాగంలో విగ్రహాల దొంగల ముఠాతో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ కుటుంబానికి ఎదురైన సమస్యలు, ఆ ముఠా నాయకుడితో జరిగిన తలపడి కథ ముగిసింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు సీక్వెల్‌లో చూపించనున్నట్లు సమాచారం.

# ఆస్ట్రేలియాకు షాక్.. జింబాబ్వే సంచలన విజయం


**వేద న్యూస్ డెస్క్:**



ఐసీసీ టీ20 ప్రపంచకప్లో సంచలన ఫలితం నమోదైంది. బలమైన ఆస్ట్రేలియా జాతీయ క్రికెట్ జట్టుపై జింబాబ్వే జాతీయ క్రికెట్ జట్టు 23 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. కొలంబోలో జరిగిన ఈ మ్యాచ్‌లో జింబాబ్వే ఆటగాళ్లు సమిష్టిగా రాణించి ప్రపంచ క్రికెట్‌లో సంచలనం సృష్టించారు. బెన్నెట్ అర్ధశతకం మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ 64 పరుగులతో జట్టుకు బలమైన ఆరంభం అందించాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 పరుగులు చేసి స్కోరును పెంచారు. 15 ఓవర్లకే 125 పరుగులు చేసిన జింబాబ్వే భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. అయితే చివరి ఐదు ఓవర్లలో ఆస్ట్రేలియా బౌలర్లు కట్టడి చేయడంతో 44 పరుగులకే పరిమితమైంది. ఆసీస్ చేతులెత్తేసింది 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 19.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ రెన్షా 65 పరుగులు, గ్లెన్ మ్యాక్స్‌వెల్ 31 పరుగులతో పోరాడినా జట్టును గెలుపు దిశగా నడిపించలేకపోయారు. చేజింగ్ ఆరంభంలోనే 29 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి ఆసీస్ కష్టాల్లో పడింది. ఐదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్‌రెన్షా జోడీ 77 పరుగులు జోడించినా మ్యాచ్‌ను మలుపుతిప్పలేకపోయారు. ముజరబానీ మెరుపు జింబాబ్వే బౌలర్లలో బ్లెసింగ్ ముజరబానీ 4 ఓవర్లలో 17 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్రాడ్ ఇవాన్స్ మూడు వికెట్లు సాధించాడు. అద్భుత ప్రదర్శనకు ముజరబానీకి మ్యాచ్ ఉత్తమ ఆటగాడి పురస్కారం లభించింది. అంతేకాదు, టీ20ల్లో వంద వికెట్లు పూర్తి చేసిన బౌలర్‌గా కూడా అతను ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఈ విజయంతో జింబాబ్వే టోర్నీలో తన అవకాశాలను బలపరుచుకోగా, ఆస్ట్రేలియాకు ఇది ఊహించని షాక్‌గా మారింది.

# రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్

**వేద న్యూస్ డెస్క్:**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజస్థాన్ రాయల్స్ జట్టు నూతన కెప్టెన్‌గా యువ ఆటగాడు రియాన్ పరాగ్ను నియమించినట్లు క్రీడా వర్గాలు వెల్లడించాయి. గత సీజన్‌లో కొన్ని మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన పరాగ్‌కు ఈసారి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. గతంలో జట్టును నడిపించిన సంజూ శాంసన్ మరో జట్టుకు వెళ్లడంతో పరాగ్‌కు అవకాశం లభించినట్లు తెలుస్తోంది. యువ ఆటగాడిగా ఐపీఎల్‌లో ఇప్పటికే మంచి అనుభవం సొంతం చేసుకున్న పరాగ్ 84 మ్యాచ్‌లు ఆడి 1566 పరుగులు సాధించాడు. 2024 సీజన్‌లో 573 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. గత సీజన్‌లోనూ వేగవంతమైన బ్యాటింగ్‌తో 393 పరుగులు నమోదు చేశాడు. బౌలింగ్‌లోనూ కీలక వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందాడు.ఇప్పటికే 2008లో షేన్ వార్న్ సారథ్యంలో తొలి టైటిల్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్, ఆ తర్వాత మళ్లీ కప్ అందుకోలేకపోయింది. ఈసారి యువ నాయకుడి నేతృత్వంలో రెండో టైటిల్ కోసం జట్టు వేట ప్రారంభించనుంది. పరాగ్ నాయకత్వం జట్టుకు కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తుందనే ఆశాభావం అభిమానుల్లో కనిపిస్తోంది. 24 ఏళ్ల యువ కెప్టెన్ బాధ్యతలను ఎలా నిర్వహిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. సీజన్‌లో రాజస్థాన్ ప్రదర్శనపై అందరి దృష్టి నిలిచింది

# పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశాలు



వేద న్యూస్ డెస్క్ :

ఐసీసీ టీ20 ప్రపంచకప్లో భాగంగా ఆదివారం పాకిస్థాన్తో జరగనున్న కీలక మ్యాచ్‌లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత జట్టు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వెల్లడించాడు. ఇటీవల కడుపు సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో బాధపడిన అభిషేక్ ఆరోగ్యం ప్రస్తుతం మెరుగుపడిందని, అతడు జట్టుతో తిరిగి సాధన ప్రారంభించినట్లు వరుణ్ తెలిపాడు. నమీబియాతో జరిగిన గత మ్యాచ్‌కు ముందు అస్వస్థత కారణంగా అభిషేక్ ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. రెండు రోజుల విశ్రాంతి అనంతరం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని, జట్టుతో మాట్లాడినప్పుడు అతడు సానుకూలంగా స్పందించాడని వరుణ్ చెప్పాడు. ఆదివారం జరిగే మ్యాచ్‌కు ముందు జరిగే సాధనలో అతడి ప్రదర్శన ఆధారంగా తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి అద్భుతంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. తక్కువ పరుగులే ఇచ్చి మూడు వికెట్లు సాధించడం ద్వారా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ మ్యాచ్ సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, అభిషేక్ ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు మిస్ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073